క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న శ్రీకాళహస్తి కమిషనర్

తిరుపతి అర్బన్ : పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి అవసరమని, ఈ మేరకు ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ మంగళవారం ఈ మేరకు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు ఓ పూల మొక్కను అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు పరిశుద్ధ తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూఏ నేతలు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఎన్‌ఎంయూఏ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు తిరుపతి ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేపట్టారు. బాబు మాట్లాడుతూ విలువైన ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడం సరికాదన్నారు. ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్‌లు కల్పించాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. ఈ క్రమంలోనే ఐఆర్ ప్రకటించాలని, పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నేతలు తాళ మోహన్, శోభన్‌బాబు, ఎంఆర్ చంద్ర, ఆర్‌ఎం రెడ్డి, ఎమ్మెస్ నాయక్, దేవరాజులు పాల్గొన్నారు.

విదేశీ విద్యా పథకం కోసం వినతి



ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : విదేశీ విద్యా పథకం త్వరలోనే ప్రారంభించాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందర్‌రాజు కోరారు. మంగళవారం ఈ మేరకు పద్మావతి అతిథి గృహంలో వినతి పత్రం అందించారు. సుందర్ రాజు మాట్లాడుతూ విదేశీ విద్యా పథకం పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులు అవకాశాలను కోల్పోతున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ విదేశీ విద్యా దీవెన పథకం పునరుద్ధరించాలని విన్నవించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్, ముఖేష్ పాల్గొన్నారు.

విస్తృతంగా ఆటోల తనిఖీ



ఆటోలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

తిరుపతి మంగళం : నగరంలోని పలు ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులు మంగళవారం విస్తృతంగా ఆటోలను తనిఖీ చేశారు. జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్ మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే తిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికంగా ప్రయాణికులను ఎక్కించుకున్న 25 ఆటోలపై కేసులు నమోదు చేసి జరిమానా వసూలు చేశారు. తనిఖీల్లో ఎంవీఐలు శ్రీనివాసరావు అధికా నాజ్ పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఒకరికి ఏడాది జైలు



నిందితుడు మద్దెల దేవదాసు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో వైఎస్ఆర్ కడప జిల్లా, కాజీపేట మండలం పట్టూరు హరిజనవాడకు చెందిన మద్దెల దేవదాసుకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ జడ్జి శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు. 2011లో ఫారెస్ట్ సిబ్బంది కాజీపేట టీజీపీ కెనాల్ సమీపంలో తనిఖీలు చేస్తుండగా నిందితుడు దేవదాసు 1561 కిలోల 71 ఎర్రచందనం దుంగలను తరలిస్తూ పట్టుబడ్డాడు.

బాధ్యతగా వన్యప్రాణుల సంరక్షణ



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

తిరుపతి మంగళం : వన్యప్రాణులను సంరక్షించుకోవడం మన బాధ్యత అని అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(ఏసీఎఫ్) నాగభూషణం తెలిపారు. ఎస్వీ జూపార్క్‌లో మంగళవారం ఏనుగుల దినోత్సవం నిర్వహించారు. ఏనుగుల ప్రాముఖ్యత, ఆహార అలవాట్లను వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులకు వివరించారు. జూఅసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.







బ్రహ్మోత్సవాలకు ఆనందగిరి ఆలయం వద్ద ఏర్పాట్లు , ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు , ముస్తాబవుతున్న ఆలయం

ఆడికృత్తికకు సర్వం సిద్ధం

ఆడికృత్తిక ఉత్సవాలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రధానంగా తనపల్లె వద్ద పద్మగిరి.. ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరిపై పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి సామాన్యులు సైతం సులువుగా దర్శించుకునేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ మేరకు ఆలయాల్లో అదనపు క్యూలను అందుబాటులోకి తీసువచ్చారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను కేటాయించారు. భక్తుల సౌకర్యార్థం కల్యాణకట్టలను సైతం ఏర్పాటు చేశారు.

- శోభాయమానంగా ఆలయాల ముస్తాబు
- పద్మగిరిలో పకడ్బందీ ఏర్పాట్లు
- ఆనందగిరిపై ఉత్సవ సంరంభం

తిరుపతి రూరల్/పాకాల : ఆడికృత్తిక మహోత్సవాలకు పద్మగిరి కొండ సిద్ధమైంది. ఆలయంలో భక్తులకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇప్పటికే కల్యాణ కట్టను అందుబాటులోకి తీసుకువచ్చారు. అదనపు క్యూలను ఏర్పాటు చేశారు. కొండపైకి చేరుకునే వాహనాలను కట్టడి చేసేందుకు రెండు చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

దండాయుధపాణికి విశేష పూజలు

తిరుపతి రూరల్ మండలం తణపల్లె వద్ద శ్రీ బాల జ్ఞాన దండాయుధపాణి ఆలయానికి ఆడికృత్తిక పర్వదినాన వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ప్రధాన అర్చకుడు షణ్ముఖ శర్మ తెలిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు విజయసింహారెడ్డి, బాలచంద్రారెడ్డి, హేమంత్ కుమార్‌రెడ్డితో కలసి ఆయన మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన ఆడికృత్తిక మహోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా 13న తిరుమంజనం, 14 ధ్వజారోహణం, 15న భరణి అభిషేకం, పట్టు వస్త్రాల సమర్పణ, 16వ తేదీ శనివారంతో ఉత్సవాలు పరిపూర్ణం కానున్నట్లు వివరించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తుల వాహనాలను కొండపైకి అనుమతించడం లేదని, కొండ కిందనే ఉచిత పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వయోవృద్ధులు, చిన్నపిల్లలు, మహిళల కోసం ప్రత్యేకంగా కొన్ని జీపలను నడిపేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కల్యాణ కట్ట వద్ద భక్తులకు ఆలస్యం కాకుండా క్షురకులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు.



పద్మగిరిలో ఏర్పాట్లను వివరిస్తున్న అర్చకుడు, ఆలయ కమిటీ సభ్యులు

నేటి నుంచి ఆనందగిరిపై..

పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. 17వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. బుధవారం ఉదయం అక్కగార్ల పూజ, సాయంత్రం మూషిక వాహనంపై వినాయకస్వామి ఊరేగింపు, 14న నంది వాహనంపై పార్వతి పరమేశ్వరుల ఊరేగింపు, 15న నెమలి వాహనంపై సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపు, 16వ తేదీన స్వామివారి పుష్ప పల్లికి సేవ, 17వ తేదీన కంకణ విసర్జన, ధ్వజావరోహణం, ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఈ క్రమంలోనే ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశామన్నారు. భక్తుల రాకపోకలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు వెల్లడించారు.

పార్టీ బలోపేతంలో యువతే కీలకం



మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ బలోపేతంలో యువతే కీలక పాత్ర పోషించాలని పార్టీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి సూచించారు. మంగళవారం పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో యువజన విభాగం నాయకులతో సమావేశం నిర్వహించారు. యువత తలుచుకుంటే ప్రభుత్వాలే కూలిపోతాయని, ఈ మేరకు రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించాలన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టాలని కోరారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు నిరంతరం శ్రమిద్దామని పిలుపునిచ్చారు. పార్టీ యువజన విభాగం నగర అధ్యక్షుడు లక్కాకుల దినేష్‌రాయల్, నవీన్, మణి, లోకేష్, గంగామోహన్, అఖిల్, ఉమాశంకర్, కిరణ్, కిషోర్, గంగాధర్, సురేష్, ఢిల్లీ పాల్గొన్నారు.

విద్యార్థి హక్కుల రక్షణే ధ్యేయం



ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : విద్యార్థి హక్కుల రక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్నామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చలపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్, ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఎస్వీయూలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జెండా ఆవిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతి లేదంటూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ దుర్మార్గమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో విద్యను కాషాయీకరణ చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో తల్లికి వందనం పథకంలో షరతులు విధించి చాలా మంది పిల్లలకు నగదు జమచేయలేదని ఆరోపించారు. ఇప్పటి వరకు డిగ్రీ, పీజీ అడ్మిషన్లు చేపట్టకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ నంబర్ 77 రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నేతలు మోహన్, వినయ్, అశోక్, పవన్, విష్ణు, గణేష్, మహేష్ పాల్గొన్నారు.

యువత దేశభక్తిని చాటాలి



ర్యాలీలో కలెక్టర్, కమిషనర్, అధికారులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: యువత దేశభక్తిని చాటాలని, దేశాన్ని నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ, ఎస్వీయూ, టూరిజం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మహతి ఆడిటోరియం నుంచి వర్సిటీ స్టేడియం వరకు వే ఫౌండేషన్ సంస్థ అందించిన వెయ్యి అడుగుల భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆయన కమిషనర్ మౌర్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ హర్‌గర్ తిరంగాలో భాగంగా రెండు వారాల పాటు స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోవాలన్నారు. ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని, 2050 నాటికి మొదటి స్థానానికి చేరుకోవడానికి యువత కృషి చేయాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ గతంలో కేవలం ఆఫీసులు, సంస్థల్లో మాత్రమే జెండా ఎగురవేసేవారని, ఇప్పుడు ప్రతి ఇంట్లో జెండా ఎగురవేసేలా ప్రోత్సహించడానికి రెండు వారాల కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. సెల్ఫీ పాయింట్ వద్ద సెల్ఫీ దిగి అప్‌లోడ్ చేస్తే సర్టిఫికెట్ ఇస్తారని, దేశభక్తి స్ఫూర్తి ప్రతిరోజూ మన పనుల్లో కనిపించాలని సూచించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టూరిజం ఆర్‌డీ రమణప్రసాద్, జిల్లా టూరిజం అధికారి జనార్దన్ పాల్గొన్నారు.

తుడా మీటింగ్‌లో కీలక నిర్ణయాలు

తిరుపతి తుడా : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మంగళవారం తుడా బోర్డు మీటింగ్ నిర్వహించారు. కలెక్టర్ వెంటేశ్వర్, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టౌన్ అండ్ సిటీ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ శివయ్య, పురపాలక శాఖ ఓఎస్‌డీ భాస్కర్ హాజరయ్యారు. దాదాపు 9 కీలక అంశాలపై చర్చించారు. తుడా పరిధిలోని 20 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మొదట విడతగా చెన్నాయిగుంట, మంగళం, శెట్టిపల్లి చెరువులను రూ. 8.6 కోట్లతో అభివృద్ధికి ఆమోదం తెలిపారు. సూరప్పకసం, పద్మావతి నగర్‌లోని తుడా లేఔట్లలో చదరపు గజం రూ.14 వేల కనీస ధరగా 13వ విడత వేలానికి వెళ్లాలని నిర్ణయించారు. శెట్టిపల్లి శ్యాటిలైట్ టౌన్‌షిప్ కోసం ప్రతిపాదించిన ఐదు నూతన రోడ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు.

నేషనల్ హైవే నిర్మాణానికి అనుమతులు

తిరుపతి మంగళం : భారతమాల పరియోజన పథకంలో భాగంగా విస్తరిస్తున్న జాతీయ రహదారి–71 కేంద్ర అటవీ, పర్యావరణశాఖ నుంచి తుది అనుమతులు రావడంతో రాష్ట్ర అటవీశాఖ పచ్చజెండా ఊపింది. కాలూరు నుంచి పీలేరు వరకు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చామల రేంజ్ పరిధిలోని భాకరాపేట రిజర్వు అటవీ పరిధిలోని భూమి సేకరణ అనుమతుల కోసం 2020లో డీపీఆర్ కన్సల్టెన్సీ మెజర్స్ చైతన్య ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ ప్రైవేటు లిమిటెడ్ వారు అటవీశాఖకు ప్రతిపాదనలు పెట్టారు. ఈనేపథ్యంలోనే నేషనల్ హైవే ఇండియన్ అథారిటీ(ఎన్‌హెచ్‌ఐఏ), అటవీశాఖ సంయుక్త సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అలాగే కనుమదారిలో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణంలో భాగంగా 30 మీటర్ల వెడల్పుతో, 18 కిలోమీటర్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు లభించాయి. ఇందుకోసం భాకరాపేట రిజర్వు అటవీ ప్రాంతంలో సుమారు 50 హెక్టార్ల భూభాగాన్ని అటవీశాఖ కేటాయించింది. ఇందుకుగానూ ఎన్‌హెచ్‌ఐఏ హెక్టారుకు రూ.8 లక్షల చొప్పున అటవీశాఖకు పరిహారం చెల్లించనుంది. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఏనుగులు, ఇతర వన్యప్రాణుల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా నాలుగు చోట్ల 20 అడుగుల ఎత్తైన మార్గాలను (అండర్‌పాస్) వదలిపెట్టాలని సూచించారు. పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే రేణిగుంట–కడప మార్గంలో 100 హెక్టార్ల భూభాగంలో 30 కి.మీ మేర నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. కేంద్రం, అటవీ, పర్యావరణ శాఖల నుంచి అనుమతులు రాగానే ఆ ప్రాంతంలో కూడా నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : వినాయక సాగర్‌లో గణేష్ ప్రతిమల నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. మంగళవారం ఈ మేరకు వినాయక సాగర్‌ను పరిశీలించారు. నిమజ్జనం పాండ్‌ను నీటితో నింపాలని సూచించారు. రాకపోకలకు రెండు మార్గాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మార్‌పల్లెలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అతిథులు, అధికారులు, అవార్డు గ్రహీతలు, స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబీకులు కూర్చునేందుకు ప్రత్యేకంగా గ్యాలరీలను తీర్చిదిద్దాలని ఆదేశించారు. 14వ తేదీ మధ్యాహ్నంలోపు సర్వం సిద్ధం చేయాలని సూచించారు. ఆర్‌డీఓ రామ్మోహన్, తుడా ఈఈ రవీంద్ర, స్మార్ట్ సిటీ ఈఈ రవి, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు రమణ, మహేష్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ నిర్వాకంపై ఫిర్యాదు



కమిషనర్‌కు విన్నవిస్తున్న కాలనీ వాసులు

తిరుపతి తుడా : స్కావెంజర్స్ కాలనీలోని తమ ప్రాణాలతో 33 వార్డు కార్పొరేటర్ చెలగాటమాడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కమిషనర్‌కు మంగళవారం విన్నవించారు. 30 ఏళ్ల క్రితం పిల్లర్లు లేకుండా నిర్మించిన నాలుగు అంతస్తుల భవనం ఉందని, దాని వెనుక బోరు వేసేందుకు కార్పొరేటర్ సిద్ధమవుతున్నారని ఆరోపించారు. బోరు వేస్తే భవనం కూలిపోయే ప్రమాదముందని, తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బ్యూటీషియన్ శిక్షణ ప్రారంభం



ముడి సామగ్రి అందిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: రాస్ జన శిక్షణ సంస్థ మంగళవారం శివజ్యోతి నగర్‌లో మహిళలకు 3 నెలల ఉచిత బ్యూటీషియన్ కోర్సు శిక్షణను సంస్థ డైరెక్టర్ మోహన్ ప్రారంభించారు. చేతివృత్తుల్లో నైపుణ్యం సాధించి ఆర్థికంగా ఎదగాలని కోరారు. రాస్ కోఆర్డినేటర్ కరుణాకర్ నాయుడు మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. అనంతరం కోర్సుకు సంబంధించిన ముడి సామగ్రిని మహిళలకు ఉచితంగా అందజేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ సుఖాకర్‌రెడ్డి, టీచర్ కె.రాజేశ్వరి, శ్రీలత పాల్గొన్నారు.

యువతే దేశ సంపద



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో మంగళవారం ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ దేశానికి యువతే సంపదని తెలిపారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, సెట్విన్ అధికారి మోహన్, ప్రొఫెసర్లు సుధారాణి, సురేంద్రబాబు, కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ పాల్గొన్నారు.

ఎస్పీడబ్ల్యూలో..

పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యువజన దినోత్సవంలో ప్రిన్సిపల్ నారాయణమ్మ, అపోలో వర్సిటీ అధ్యాపకుడు మహేంద్రనాథ్, రెడ్‌క్రాస్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ పాల్గొన్నారు

ఆర్‌సీహెచ్ ఆస్పత్రిలో..

చంద్రగిరి : ఆర్‌హెచ్‌సీ ఆసుపత్రిలో నిర్వహించిన యువజన దినోత్సవంలో డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అలాగే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు శ్రీధర్, మధుసూదన్ రావు, సౌమ్య ప్రియ, రేవతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ టాటాబాయి, సూపర్‌వైజర్లు తులసీరామ్, నారాయణ రాజు పాల్గొన్నారు.

మూగజీవాల చోరీ

చంద్రగిరి: దొడ్డిలో ఉన్న మేకలు, పొట్టేళ్లు చోరీకి గురైన ఘటన మంగళవారం వెలుగు చూసింది. వివరాలు.. తొండవాడకు చెందిన బగాది సుందర రామయ్య మేకలు, గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలానే దొడ్డిలో జీవాలను వదిలిపెట్టాడు. సోమవారం రాత్రి వర్షం కురవడంతో ఇంటికి వెళ్లినట్లు సుందర రామయ్య తెలిపారు. తెల్లవారుజామున 5 గంటలకు మేకల దొడ్డి వద్దకు వెళ్లగా.. 11 జీవాలు చోరీకి గురయ్యాయని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

నోటీస్ బోర్డు

- శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటలకు అండర్–19 బాలబాలికల బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు.
- అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ ప్రతినిధి, బీసీ సంక్షేమ సంఘ నేతల ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం వద్ద మెగా ఉచిత వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు అవయవదానం–అవయవాల మార్పిడిపై అవగాహన సదస్సు.
- తిరుచానూరులోని పద్మావతీదేవి ఆలయంలో ఉత్తరాభాద్ర నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి తిరుచ్చి ఊరేగింపు.

రేపటి నుంచి సిద్ధేశ్వరుని పవిత్రోత్సవాలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : అన్నమయ్య జిల్లా తాళ్లపాకలోని శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఈ మేరకు మంగళవారం టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది.

పవన్‌కు అండగా ఉంటాం

తిరుపతి తుడా : ఇటీవల జరిగిన దాడిలో గాయపడి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దళితుడు పవన్‌ను ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ మంగళవారం పరామర్శించారు. బాధితుడికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చోరీ కేసులో సత్య సాయి జిల్లా, కదిరి మండలం, కళా సముద్రానికి చెందిన పఠాన్ సాహిద్ బాషాకు 215 రోజుల జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్య కాంత్ కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. గత ఏడాది డిసెంబర్ 9వ తేదీన రేణిగుంట, బుగ్గ వీధిలో ఎస్.రమేష్ రాజు ఇంటి వద్ద ద్విచక్రవాహనాన్ని అపహరించిన కేసులో సాహిద్ బాషాను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. విచారించిన న్యాయమూర్తి ఈ మేరకు నిందితుడికి శిక్ష విధించారు.

ఔషధ భద్రతపై అవగాహన

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఔషధ భద్రతా సంస్కృతిని నిర్మించడం అనే అంశంపై నిరంతర వైద్య విద్యలో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ రవిప్రభు, సూపరింటెండెంట్ రాధ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వైద్యులు కిరీటి, సునీత, డీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు అభినందన

తిరుపతి కల్చరల్ : ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలతో గ్రాట్యూటీ, 108 రోజుల మెటర్నటీ లీవ్, 62 ఏళ్ల రిటైర్మెంట్ పెంపు జీవో 94ను సాధించి ఆశాలను సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో అభినందించారు.

ఎస్పీడబ్ల్యూలో యాంటీ ర్యాగింగ్ డే

తిరుపతి సిటీ : పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్ అని ప్రిన్సిపల్ నారాయణమ్మ తెలిపారు. మంగళవారం యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ అనే మాట కళాశాల ఆవరణలో వినిపించదన్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ కన్వీనర్ వసుధ, జయశ్రీ, లక్ష్మీ సంధ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.